క్లుప్తంగా

రోడ్డుపై వర్షపు నీరు



అశోక్‌నగర్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ సాయినగర్ వద్ద గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికి ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు నిలిచింది. దీంతో పాదచారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సాయిబాబా ఆలయ సమీపంలో రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం పరిసరాల్లో పైపుల మార్పు కోసం తవ్వకాలు చేసి ఎక్కడ మట్టి అక్కడే వదిలేయడంతో వరద నీరు సైడ్ డ్రైన్‌లోకి పోయే దారి లేక చిత్తడిచిత్తడిగా మారుతోంది. కొద్దిపాటి వర్షానికే భారీగా ఆలయ సమీపంలోని ప్రధాన రోడ్డుపై వరద నీరు భారీగా నిలవడం పట్ల స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి సైడ్‌డ్రెయిన్‌లో వరద నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాఠశాలలో తనిఖీ

అశ్వారావుపేటరూరల్: పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత అన్నారు. గురువారం కాంప్లెక్స్ పరిధిలోని అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి హాజరును ఉదయం 10గంటలోపు ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో నమోదు చేయాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బీవీ సత్యనారాయణ, లీలావతి, శారద, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో నేటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఒరిస్సా వాసులు పూరి జగన్నాథ రథయాత్రకు అనుసందానంగా ప్రతి ఏడాది గౌతమీనగర్ కాలనీలో జగన్నాథ రథయాత్ర కన్నుల పండుగగా జరుపుకుంటారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అధికారులు, ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల భక్తులు, కాలనీ వాసులు బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఒరిస్సాకు చెందిన అధికారులు, ఉద్యోగులచే ఏర్పడిన ఉత్కల్‌ప తాగర్ సమితి ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు నేడు ఉదయం అధ్యాపూజతో ఉత్సవాలు ప్రారంభమై జూలై 5న బాహుడా యాత్రతో ముగియనున్నాయి.

దోమ తెరల పంపిణీ

కరకగూడెం: పేదలకు అండగా నిలబడటమే నిజమైన సేవని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.గురువారం 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్'సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో మండలంలోని అశ్వాపురంపాడ్ వలస ఆదివాసీ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలోని సుమారు 50 కుటుంబాలకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశిష్ట సేవలందిస్తున్న ఫౌండేషన్ వారిని అభినందించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు సోందుపాషా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై పీవీఎన్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మండలంలో గురువారం మాజీ ఎమ్మెల్యే రేగా విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, తుమ్మలచెరువు గ్రామాల్లో పలువురు మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శించారు. తుమ్మలచెరువులో లోతువాగుపై వంతెనను రేగా పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసిన శంకుస్థాపన శిలాఫలాకాన్ని రేగా పరిశీలించారు. తుమ్మలచెరువు, వెంకటాపురం, గొంది గూడెం గ్రామాల్లో రేగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, ఎన్నా అశోక్‌కుమార్, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తూము వీరరాఘవులు, పాటి మన్మథరెడ్డి, బొర్రా శ్రీను, తాటి పూజిత, కోండ్రు రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వం పాలిథిన్ మయం..

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- నిషేధంపై అధికారుల పర్యవేక్షణ కరువు
- పర్యావరణానికి పొంచివున్న ముప్పు



భద్రాచలంలో డ్రెయినేజీ పక్కన పడేసిన ప్లాస్టిక్ కవర్ల కుప్ప

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్య క్షేత్రమైన భద్రాద్రి పట్టణంతో పాటు డివిజన్‌లో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు విచ్చలవిడిగా పెరిగిపోతోంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజల నిర్లక్ష్యం పర్యావరణానికి ముప్పు తీసుకొస్తోంది. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు, కవర్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. కానీ ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మొదట్లో హడావుడి చేసిన అధికారులు తరువాత పత్తా లేకుండా పోతున్నారు. దీంతో డ్రెయినేజీలు, గోదావరి తీరంతో ప్లాస్టిక్ వస్తువుల వ్యర్థలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా పట్టణంలోని ఖాళీ స్థలాల్లో కవర్లు, గ్లాసులు అధికంగా కనిపిస్తున్నాయి.

తూతూమంత్రంగా దాడులు

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై నిఘా ఉంచేందుకు అధికారులు పట్టణాలలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ప్లాస్టిక్ వినియోగం, నిల్వ ప్రదేశాలు, విక్రయ దుకాణాలు, దిగుమతులు పంపిణీపై దృష్టి సారించి ఎవరైనా ప్లాస్టిక్ వినియోగిస్తే తక్షణమే జరిమానా విధిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధిస్తారు. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడంలేదు. అధికారులు మాత్రం నామమాత్రంగా దాడులు చేస్తూ ఎదో ఒక దుకాణ యజమానికి జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమలు కాని నిషేధం..

ప్లాస్టిక్ నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 1 నుంచి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకసారి వాడే ప్లాస్టిక్ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం, నిల్వ, పంపిణీ, విక్రయం, వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు నిషేధం పరిధిలోకి వస్తాయని తెలిపింది. ప్రతీ అవసరానికి అలవాటుపడిన ప్రజలు అన్నింటికీ కవర్లు, వస్తువులు వినియోగిస్తున్నారు. పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. కవర్లను మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి.



రామాలయం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

అవగాహన ఏదీ?

ప్లాస్టిక్ నిషేధం అమలైన మొదట్లో అధికారులు అవగాహన కల్పించారు. పట్టణంలోని చిరువ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రధాన సెంటర్లు, హోటళ్లు, దుకాణాల వద్ద ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని బోర్డులు సైతం పెట్టారు. కానీ తరువాత అధికారులు దృష్టి సారించకపోవడం వాడకం మళ్లీ పెరిగిపోయింది. ఇప్పటికైనా అధికారులు పట్టణంలోని ప్రధాన మార్కెట్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన వుంది.

ప్రజలకు అండగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

మణుగూరుటౌన్: దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా, పీడిత ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తోందని, సమ సమాజ స్థాపన జరగాలని పోరాడింది కమ్యూనిస్టు పార్టీనే అని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. గురువారం మండలంలోని కిన్నెర కల్యాణ మండపంలో చింతల దశరథ, దుబ్బాక నిర్మల, బాడిశ సతీష్ అధ్యక్షత మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. 100 సంవత్సరాల సుదీర్ఘపోరాటంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని దున్నేవానికి భూమి కావాలని నినాదంతో పెట్టుబడి దారులు భూస్వాములపై తిరుగు బాటు చేసి అనేక వేల మంది ప్రాణాలు పొగొట్టుకున్నారన్నారు. వేలాది ఎకరాల భూములు పేదలకు పంచిన చరిత్రకమ్యూనిస్టు పార్టీదన్నారు. పేద ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీలపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తూ అణచివేత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య మాట్లాడుతూ.. ఈ ప్రాంత పేద ప్రజల కోసం సీపీఐ అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిందన్నారు. సమావేశంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, లక్ష్మీనారాయణ, సర్వర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్, ఏఐటీయూసీ నాయకులు రాయల భిక్షం, గద్దం వెంకటేశ్వర్లు, బోలగాని సమ్మక్క, దుబ్బాక నిర్మల, కొత్తపల్లి సీతారాములు తదితరులు ఉన్నారు.

బాలనర్సయ్య సేవలు మరువలేనివి..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ స్వర్గం బాలనర్సయ్య ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ అన్నారు. మల్లెలమడుగు గ్రామంలో స్వర్గం పెద సాయన్న, మల్లయ్య, లింగయ్య జ్ఞాపకార్థం స్వర్గం భద్రయ్య, బాలనర్సయ్య, మంగి గౌరమ్మలు గ్రామానికి రూ.60 వేలు విలువ గల శీతలశవపేటికను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ బాలనర్సయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తూము వీరరాఘవులు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, చెంచల రాము, సీపీఎం నాయకులు గద్దల శ్రీనివాసరావు, దండి రాములు, సాంబశివరావు, శంభిరెడ్డి, కొప్పుల పద్మ, టీడీపీ మండల పార్టీ కోశాధికారి అమరనేని సీతరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీజర్ అందజేస్తున్న నాయకులు


ఓసీ-4 కార్మికుల సమస్యలపై వినతి

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని ఓసీ4 కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం గని మేనేజర్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ... సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాంనర్సయ్య, నాయకులు మేకల ఈశ్వర్‌రావు, పుల్లారావు, శ్రీనివాస్, ఆవుల నాగరాజు, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన దారావత్ వెంకటేశ్వర్లు అనారోగ్య కారణంగా ఇటీవలే మృతి చెందగా.. గురువారం మంత్రి తుమ్మల, మృతుడి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందుగా గండుగులపల్లిలోని నివాసంలో మంత్రి తుమ్మలను పలువురు రైతులు మర్యాదపూర్వకంగా కలసి, రైతు భరోసా నగదును తమ ఖాతాల్లో జమ చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపి, మంత్రిని శాలువాతో సత్కరించారు.మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలు ప్రమాదకరం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు రేపాకుల శ్రీనివాస్

బూర్గంపాడు: మతతత్వ రాజకీయాలు దేశ భవిష్యత్‌కు అత్యంత ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ అన్నారు. బూర్గంపాడులో గురువారం జరిగిన సీపీఎం మండల స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. సీపీఎం మతాలకు వ్యతిరేకం కాదని, మత ఉన్మాదానికి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై, మతోన్మాదంపై సీపీఎం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, ఎస్‌కె.అబీదా, కందుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం..

కరకగూడెం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో నిందితుడి అరెస్టు

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో జరిగిన ఘర్షణకు సంబంధించి నిందితుడు బత్తుల ఉపేంద్రను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

నేడు ధర్నా

దుమ్ముగూడెం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న హైదరాబాదులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజు, మండల ప్రధాన కార్యదర్శి బి.రవిలు పిలుపునిచ్చారు. గురువారం జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అశ్వారావుపేట: పోలీస్, ఫారెస్టు అధికారులు అశ్వారావుపేటకు చెందిన చిలకా చిరంజీవి అనే దళితుడి ఇంటిని అక్రమంగా ఇల్లు కూల్చివేశారని తహసీల్దార్ రామకృష్ణకు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. కేవలం పూల కొట్టు మాత్రమే తొలగించాలని తహసీల్దార్ ఆదేశాలు ఇవ్వగా అక్రమంగా, అత్యుత్సాహంగా చిరంజీవి ఇంటిని కూడా కూల్చివేశారని వివరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య, ఇసంపల్లి కృష్ణ, కోలేటి పకీరయ్య, వెంకన్న, శ్రీను, బీజేపీ మహిళా నాయకురాలు దేవి, యాకూబ్, బేగం, ముక్రంఖాన్ తదితరులున్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు?

కరకగూడెం: మండలంలో వలస ఆదివాసీల జోలీ మోతల కష్టాలు తీరడం లేదని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వీరికి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో లేవని అన్నారు. 30 సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం ఈ ప్రాంతానికి వచ్చిన ఆదివాసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

'రెండు సార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వం'

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ)/ములకలపల్లి: అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వం రెండుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టగా.. కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదని బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి అన్నపురెడ్డిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతోనే రైతుభరోసా జమ చేశారని తెలిపారు. అనంతరం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో రాకేష్‌రెడ్డి పూజలు చేశారు. నాయకులు బోయినపల్లి సుధాకర్‌రావు, కొత్తూరి వెంకటేశ్వరరావు, సున్నం లలిత, భరత రాంబాబు, జంగాల ఉమామహేశ్వరరావు, నర్సారెడ్డి పాల్గొన్నారు. అలాగే, ములకలపల్లి మండలం సూరంపాలెంలో స్థానిక నేతలతో సమావేశమైన రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సూచనలు చేశారు. నాయకులు మట్ల నాగమణి, కొంసుందర్‌రావు, బైటి రాజేశ్, నాగరాజు, తాటి ప్రవీణ్, కుంజా వెంకటేశ్వర్లు, ఆదిమూలం యాదగిరి, కుంజా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి, పక్కన మెచ్చా

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం..

అశ్వారావుపేటరూరల్: రైతులకు దుకాణాలదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న పలు విత్తనాల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో పత్తి, మొక్కజొన్న విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ.. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ

మా భూములు మాకు ఇచ్చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దమ్మపేట: తమ భూములు తమకు ఇచ్చేయాలంటూ సీతారామ ప్రాజెక్ట్ నిర్వాతుల తరుపున ఆదివాసీ జిల్లా నాయకుడు కారం శ్రీరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జగ్గారంలో అదే గ్రామ పంచాయితీ పరిధిలోని సీతారామ ప్రాజెక్టు నిర్వాసిత గిరిజన రైతులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కారం శ్రీరాములు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువకు తమ గ్రామంలోని 127 మంది గిరిజన రైతుల నుంచి 103 ఎకరాల 7 కుంటల భూమిని సేకరించి, నేటికీ పరిహారం అందకపోవడం శోచనీయం అన్నారు. ఈ కారణంగా రైతు భరోసాతో పాటుగా వ్యవసాయ రుణాలను కూడా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జూలూరుపాడు మండలంలోని నిర్వాసిత రైతులకు ఒక ఎకరాకు రూ.24 లక్షల పరిహారం చెల్లించిన మాదిరిగానే తమకు చెల్లించాలని, లేదంటే భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన రైతులు కల్లూరు రాజేష్, కుర్సం చిన్న రాజులు, కణితి వెంకటేశ్వరరావు, కొమరం రాము, మడకం బొడప్ప, వగ్గేల తులసమ్మ పాల్గొన్నారు.

'పార్టీ కార్యాలయం కబ్జా చేసిన ఘనత రేగాది'

అశ్వాపురం: కార్యకర్తల రెక్కల కష్టంతో కట్టుకున్న పార్టీ కార్యాలయం కబ్జా చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుది అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆరోపించారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పైన, శాసనసభ్యుడిపైన, తమ పార్టీ నాయకులపైన చౌకబారు పోస్టులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల ముందు హడావుడిగా నువ్వు శిలాఫలకాలు వేస్తే నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేసిన ఘనత తమ శాసనసభ్యుడు పాయందే అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తుక్కాని మధుసూదన్‌రెడ్డి, బేతం రామకృష్ణ, ఆవుల రవి, కారం శ్రీను, కొండబత్తుల ఉపేందర్, శ్రీనివాస్, వెంకటరమణ, నరసింహారావు, సంపత్, రాము, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓరుగంటి భిక్షమయ్య

సాయి ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాన్ని మణుగూరు పట్టణంలోని శ్రీశ్రీలక్ష్మీ శ్రీనివాస జ్యుయలరీ ప్రొప్రైటర్ దుగ్గి సతీష్‌కుమార్-నీలిమ దంపతులు, వారి కుటుంబ సభ్యులు సుహాస్, సంతోషి, స్మయాన్, సాహితి, పుష్పావతిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సతీష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాత సతీష్‌కుమార్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీసులు, ఇతర అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. అవగాహన ప్రదర్శనలు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకం వల్ల యువత, విద్యార్థులు, ప్రజలు అంధకార జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలను ఎవరైనా రవాణా చేసినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: నాగుపల్లిలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారం..



గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బూర్గంపాడు: మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఐ నాగభిక్షం



మణుగూరురూరల్: డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన ర్యాలీలో న్యాయ, పోలీస్, ఎక్సైజ్ అధికారులు